క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: పట్టణంలోని లైఫ్‌కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో ఈనెల 30వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లైఫ్‌కేర్ ఆసుపత్రి వైద్యుడు పి.మునిరామయ్య తెలిపారు. పట్టణంలోని ఒకటో తూము వద్ద గల లైఫ్‌కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మెగా వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరంలో సాధారణ వ్యాధులు, గుండెకు సంబంధించిన ఈసీజీ, ఇతర వైద్య సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడిపై బీరు సీసాతో దాడి

పెనమలూరు: కానూరులో ఓ యువకుడిపై మరో వ్యక్తి బీరు సీసాతో దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పలిపే బెంజిమెన్(27) కారు ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను తన మిత్రుడు రవితేజతో కలిసి కామయ్యతోపులో ఉన్న బార్ షాపునకు వెళ్లాడు. అయితే అక్కడ ఉన్న బట్ట శ్రీరామ్ బెంజిమెన్‌తో గొడవపడి బీరు సీసాతో బెంజిమెన్‌పై దాడి చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పింఛన్ సొమ్ము మంజూరు

పెనమలూరు: పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి విడుదల చేసిందని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. ఆమె శనివారం వివరాలు తెలుపుతూ పెనమలూరు మండలంలో, తాడిగడప మున్సిపాలిటీలో ఉన్న వివిధ పింఛన్ లబ్ధిదారులకు 17,922 మందికి రూ.4.93 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పెనమలూరు మండలంలో 5555 మంది లబ్ధిదారులకు రూ.1.53 కోట్లు, తాడిగడప మున్సిపాలిటీలో 12,367 మందికి రూ.3.45 కోట్లు చొప్పున నిధులు విడుదల చేశామని, వచ్చే నెల 1వ తేదీన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్‌లు పంపిణీ చేస్తారని తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

పెనమలూరు: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ నేత, విశ్రాంత పీడీ కటికల క్రిస్టోఫర్ అన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గత ఏడాది ఉత్తమ మార్కులతో పాస్ అయిన నలుగురు విద్యార్థులకు రూ.3 వేల ఉపకార వేతనాలు అందించారు. హెచ్‌ఎం ఎస్.కనకదుర్గ ఉత్తమ మార్కులు, ఉత్తమ అటెండెన్స్ సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. దాత కాలారు విద్యాసాగర్ వర్మ పాఠశాలకు డిపాజిట్ చేసిన రూ.లక్ష సొమ్ముపై వచ్చిన వడ్డీతో వార్షికోత్సవం నిర్వహణకు ఖర్చు చేస్తున్నామని హెచ్‌ఎం తెలిపారు. పీసీ కమిటీ చైర్మన్ ఎ.బాబూరావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంచార పశువైద్య సేవలపై రైతుల హర్షం

హనుమాన్‌జంక్షన్ రూరల్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనం అందిస్తున్న సేవలపై పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన పాడిరైతు కోడెబోయిన బాబికి చెందిన ఆవుకు లంపీస్కిన్ వ్యాధి సోకి అనారోగ్యానికి గురికావటం, కాలుకి గాయం కావటంతో హెల్ప్‌లైన్ నంబర్ 1962కు శనివారం కాల్ చేశాడు. దీంతో కొద్దిసేపటికే డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనం ఆయన ఇంటికి చేరుకుంది. పశువైద్యుడు డాక్టర్ వరప్రసాద్ ఆవుకు వైద్యం అందించారు. మూడు రోజుల పాటు వైద్యం అందించాలని పాడిరైతుకు సూచించారు. ఫోన్ చేసిన వెంటనే ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించటంతో పాడిరైతు కోడెబోయిన బాబి ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనం పథకాన్ని అమలు చేయటంపై కృతజ్ఞతలు తెలిపారు.

టెక్‌బీ ప్రోగ్రాం పరిశీలన

గన్నవరం: స్థానిక హెచ్‌సీఎల్ టెక్నాలజీ క్యాంపస్‌లో శనివారం ఇంటర్ అర్హతతో హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక నిర్వహించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ టెక్‌బీ ప్రోగ్రాం ద్వారా ఇంటర్ అర్హతతోనే ఏడాది శిక్షణ పూర్తిచేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ ఎంపికలు నిర్వహిస్తుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు ఎస్.శ్రీనివాసరావు, కల్లం శ్రీధర్, నరేష్‌కుమార్, పలువురు హెచ్‌సీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాంబాబుకు అవార్డు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి పాలడుగు పార్వతీదేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆరేపల్లి రాంబాబుకు ఇన్నోవేటివ్ అకడమిషియన్ అవార్డు వరించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో గ్లోబల్ అవార్డ్స్–2023 సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.కళాశాల చైర్మన్ డాక్టర్ పాలడుగు పార్వతీదేవి, ప్రిన్సిపాల్ కె.కృష్ణమూర్తి, సీఈవో రమేష్ అభినందించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థినికి ప్రోగ్రెస్ రిపోర్ట్ అందజేస్తున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ రాజాబాబు

గన్నవరం: గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు జగనన్న కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయలను కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని కేసరపల్లి శివారులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..83.12 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ లేవుట్‌లో మొత్తం 3,187 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. వీరిలో 1,943 గృహ నిర్మాణాలు ప్రారంభం కాగ 1,743 గృహాలు బిలో బేస్మెంట్ లెవల్, 92 బేస్మెంట్ లెవల్, 10 రూఫ్ లెవల్, ఆరు గృహాలకు స్లాబ్‌లు పూర్తికాగా, 27 గృహాలు పూర్తయినట్లు చెప్పారు. ఈ కాలనీలో లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ. 71.70 లక్షలు చెల్లించగా, మరో 68.29 లక్షల విలువైన మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణాలకు నీటి అవసరాల నిమిత్తం బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అంతర్గత రహదారులు నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ కాలనీకి ప్రధాన రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదన కూడా ఉందన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ జీవీ.సూర్యనారాయణ, ఆర్డీవో పద్మావతి, డీపీవో నాగేశ్వర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణరాజు, జెడ్పీకో ఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, నిడమర్తి సౌజన్య, తహసీల్దారు సీహెచ్. నరసింహారావు, ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్..

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేరెంట్స్, టీచర్, స్టూడెంట్ బంధం విద్యా వికాసానికి తోడ్పడుతుందని చెప్పారు. దీని కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో పేరెంట్స్ సమావేశం విధిగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి తహెరా సుల్తానా, ఆర్డీవో పద్మావతి, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం సీహెచ్.అనిత పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న గృహాల నిర్మాణం పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా వణుకూరు గ్రామంలో చేపట్టిన జగనన్న గృహాల నిర్మాణం వెంటనే పూర్తి చేసి ,ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అన్ని శాఖల అధికారులతో జగనన్న గృహాల నిర్మాణంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పెనమలూరు నియోజకవర్గంలో 35 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. దీనినిమిత్తం భూసేకరణకు రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి స్థలం హద్దులు నిర్ణయించి ఇళ్ల స్థలాలు అప్పగించామని అన్నారు. ఇళ్ల నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. వణుకూరు లేఅవుట్‌లో దాదాపు 19 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, వచ్చే జనవరి కల్లా 15 వేల మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమన్వయంతో పని చేయాలి

జగనన్న గృహాల నిర్మాణం విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్‌లైన్లు, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎంసీకి చెందిన లబ్ధిదారుల గృహాల నిర్మాణం విషయంలో కూడా అందరూ కలిసి పని చేయాలన్నారు. కాలనీలకు అవసరమైన నిధులు సమకూర్చే విధంగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సర్పంచ్‌లు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, గుంటూరు శ్రీనివాసచౌదరి, సంగెపు శ్రీనివాసరావు, తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి వసతుల కల్పనకు చర్యలు

కంకిపాడు: తాగునీటి వసతుల కల్పనకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని వేల్పూరు సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ అన్నారు. మండలంలోని వేల్పూరు ప్రధాన సెంటరులో ఏర్పాటుచేసిన చలివేంద్రంను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు, మల్లంపల్లి దుర్గారావు, పామర్తి రాముడు, దాసరి శ్రీను, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తం

కంకిపాడు: దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.సుధాకర్ సూచించారు. ఈ మేరకు మండలంలోని కంకిపాడు, ఈడుపుగల్లు, మద్దూరు, గొడవర్రు, ఉప్పులూరు, ప్రొద్దుటూరు, నెప్పల్లి, కోలవెన్ను, తెన్నేరు తదితర గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మైక్ ప్రచారం చేపట్టారు. ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ వేసవి రీత్యా ఆరుబయట నిద్రించటం, ఇళ్లకు తాళాలు వేసి డాబాలపై పడుకోవటం వల్ల చోరీలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ఊళ్లు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను వెంట తీసుకుని వెళ్లటం కానీ, పోలీసు శాఖకు సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవటం కానీ చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే చోరీలను నియంత్రించటం సాధ్యమవుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

రామవరప్పాడు: ఉన్నత విద్యతోపాటు విద్యార్థులు అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈవో ఆదూరి వెంకటరత్నం అన్నారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు శివారు వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీట్‌ను నిర్వహించారు. ఇటీవల నైజీరియన్ ప్రభుత్వ అధికారులు సందర్శించిన సందర్భంగా పలు విభాగాల్లో అభినందనలు పొందిన విద్యార్థులను, గుణాదిత్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ నిర్వహించిన మ్యాథ్స్ డేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. నవజీవన్ బాల సదన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ శేఖర్ మాట్లాడుతూ మద్యం అలవాటు పడి మానలేని వారికి ఉచితంగా యాంటీ డ్రగ్ ఇవ్వడం ద్వారా ఈ సమస్యలను నుంచి బయట పడొచ్చునన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. ఎండీ వసంతకుమారి, ప్రధానోపాధ్యాయురాలు మనోజ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అంక మహాలక్ష్మి, మహిళా పోలీసు మేడూరి సజని పాల్గొన్నారు.

గుండెపోటుతో కేసీపీ సూపర్‌వైజర్ మృతి

ఉయ్యూరు: కేసీపీ చెరకు సూపర్‌వైజర్ పేరం మధుసూదన్‌రావు (56) అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు. ఉయ్యూరు తోట్లవల్లూరు రోడ్డులో నివాసం ఉంటున్న మధుసూదన్‌రావు కేసీపీ కర్మాగారంలో వ్యవసాయ విభాగంలో చెరకు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. మండలంలోని పెద ఓగిరాల ఏరియా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం గుండెపోటు రావటంతో కుటుంబసభ్యులు, సహ ఉద్యోగులు ఉయ్యూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. మధుసూదన్‌రావు మృతితో కేసీపీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన భౌతికకాయాన్ని కేసీపీ సంస్థల యూనిట్ హెడ్ వై.సీతారామదాసు, కార్మిక సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, చెరకు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు ఎస్వీ కృష్ణారావు సందర్శించి నివాళులర్పించారు.

మెరుగైన బ్యాంకింగ్ సేవలే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించటంలో భారతీయ స్టేట్ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ (సేల్స్) టీఆర్‌టీ ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం వేలేరులో స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 'ఎస్‌బీఐ గ్రామ రాత్రి శిబిరం' నిర్వహించారు. రైతులు, డ్వాక్రా మహిళలకు ఎస్‌బీఐ అందిస్తున్న వివిధ రకాల సేవలను గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, సర్పంచ్ సోదిమెళ్ల సుందరమ్మ, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, ఎస్‌బీఐ జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ జి. నరేంద్ర పాల్గొన్నారు.

రేపు తాడిగడప సెంటర్‌లో మేడే సభ

పెనమలూరు: కార్మిక దినోత్సవం సందర్భంగా తాడిగడప సెంటర్‌లో మే ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మండల సీఐటీయూ కార్యదర్శి యు.త్రిమూర్తి తెలిపారు. సభలో జిల్లా సీఐటీయూ కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు పాల్గొంటారన్నారు. సాయంత్రం 4.30 గంటలకు పోరంకి సెంటర్ నుంచి తాడిగడప సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

గన్నవరం: నియోజకవర్గంలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గన్నవరం పట్టణ పరిధిలో భారీవర్షానికి పలు రోడ్లు నీటమునిగాయి. స్థానిక కొత్తపేట వద్ద చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై మోకాలి లోతున నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో లోతట్టులోని ఇళ్లు, రోడ్లు ముంపునకు గురయ్యారు. దావాజీగూడెం–అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలిమేర వాగు పూడుకుపోవడం వల్ల పరిసరా ప్రాంతాలు ముంపు బారినపడ్డాయి. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు తొలగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో శనివారం కురిసిన కుండపోత వర్షం కారణంగా స్థానిక మహాత్మగాంధీ నగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వర్షపు నీరు నిల్చిపోవటంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల నుంచి వర్షపు నీటిని బయటకు తరలించేందుకు హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సహకారాన్ని తీసుకున్నారు. ఫైర్ ఆఫీసర్ జి.మోహనరావు, ఫైర్ మెన్లు సాంబశివరావు, కోటేశ్వరరావు, నాగార్జున, పంచాయతీ సిబ్బంది శ్రమించి కాలనీలో వర్షపు నీటిని బయటకు తరలించారు.

అందరి నోటా 'జగనన్నే మా భవిష్యత్తు' మాట

కంకిపాడు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, జగనన్న సచివాలయాల మండల చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆదేశాలతో ఈనెల 7 నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 1.12 లక్షల ఇళ్లను సందర్శించాలని లక్ష్యం నిర్దేశించుకోగా 86 వేల గృహాలను సందర్శించామన్నారు. 78 వేల మంది ప్రభుత్వానికి మద్దతు పలికారన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు లబ్ధి పొందిన పరిస్థితిని స్పష్టంగా చూశామన్నారు. కొందరు విపక్షాల ప్రతినిధులు మాత్రం ప్రభుత్వంపై బురద చల్లే పనిలోనే ఉన్నారన్నారు. వాస్తవ విరుద్ధంగా చేస్తున్న వ్యాఖ్యలను సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు మాగంటి శ్రీనివాసరావు, పటాకుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా సహాయ కార్యదర్శి మాదు వసంతరావు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వల్లె నరసింహారావు, జిల్లా నేత బత్తుల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని శనివారం డీఈవో తెహెరా సుల్తానా పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను, పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె పర్యవేక్షించారు. ఈ కేంద్రంలో ప్రవేశ పరీక్షకు మొత్తం 281 మంది విద్యార్థులకుగాను 243 మంది హాజరైనట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పాఠశాల హెచ్‌ఎం ఎన్.రవీంద్రభవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై సర్వత్రా సంతృప్తి

గన్నవరం: 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మెగా పీపుల్స్ సర్వేలో నియోజకవర్గంలోని 90 వేల కుటుంబాల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి తెలిపారు. స్థానిక శాసన సభ్యుని కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 249 మంది సచివాలయ కన్వీనర్లు, 3,500 మంది గృహ సారథులు, మూడు వేలకుపైగా పార్టీ శ్రేణులు జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్నారని చెప్పారు. మెగా పీపుల్స్ సర్వేలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు మద్దతుగా లక్షకుపైగా మిస్డ్‌కాల్స్ ఇచ్చారన్నారు. విజయవాడ రూరల్ జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పడమట సురేష్, సచివాలయాల మండల కన్వీనర్లు కైలే శివకుమార్, సాదం వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేచినేని బాబు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, కొల్లి రాజశేఖర్, జలసూత్రం రామ్మోహన్‌రావు, ఎస్‌కేఎంఎపీ.కలాం, లుక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన చింతా వాసు ప్రసాద్ (24) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమించాడు. మార్చిలో మైనర్ బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి వాసుప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. వాసు బాలికను పెళ్లి చేసుకుంటానని ఆమె కుటుంబ సభ్యులను కోరగా వారు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన వాసు ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పిన్నమనేని సిద్దార్థ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోరంకి చైతన్య కాలేజీ వద్ద ఆందోళన





కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న వాణి బంధువులు, విద్యార్థి సంఘాలు(ఇన్‌సెట్‌లో వాణి)

పెనమలూరు: శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని జగన్నాథం వాణి (17) మృతి చెందిన ఘటనపై కాలేజీ వద్ద ఆమె బంధువులు, విద్యార్థి సంఘాలు శనివారం ఆందోళన చేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి పోరంకి శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం బైపీసీ చదువుతోంది. ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ తప్పింది. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వాణి మరణానికి యాజమాన్యమే కారణమని ఆరోపిస్తూ వాణి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్, యాజమాన్యాన్ని విచారించి తగిన న్యాయం చేయాలని మృతురాలి తండ్రి జగన్నాథం శ్రీను కోరారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

ఆటో డ్రైవరు నిజాయతీ

పర్సు పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగింత



పోలీసుస్టేషన్‌లో పర్సును అప్పగిస్తున్న ఆటో డ్రైవరు గంటా ప్రవీణ్

కంకిపాడు: ఆటోలో ప్రయాణించిన మహిళ పోగొట్టుకున్న పర్సును నిజాయితీతో ఆ మహిళకు అప్పగించి ఆటో డ్రైవరు తన నిజాయితీ నిరూపించుకున్నాడు. కంకిపాడు పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై సేకరించిన వివరాల ప్రకారం ...మండలంలోని గొడవర్రుకు చెందిన ఎరుమోకు దేవరమ్మ ఈనెల 28న కంకిపాడులోని ఎస్‌బీఐకి వెళ్లి రూ.15 వేలు డ్రా చేసి పర్సులో పెట్టుకుని బ్యాంక్ వద్ద ఆటో ఎక్కింది. కంకిపాడు సెంటరులో ఆటో దిగి చూసుకునేసరికి పర్సు కనిపించలేదు. అయితే ఆటోలోనే ఆమె పర్సు వదిలేయటం చూసిన ఆటో డ్రైవరు గంటా ప్రవీణ్ కంకిపాడు పోలీసులకు దానిని అప్పగించాడు. పర్సు పోగొట్టుకున్న దేవరమ్మకు ఆటోడ్రైవరు ద్వారా పర్సును అందించారు. నిజాయితీ ప్రదర్శించిన ఆటోడ్రైవరు ప్రవీణ్‌ను ఎస్‌ఐ కె.సుధాకర్ అభినందించారు.

సీఏ విద్యార్థినికి ప్రతిభా పురస్కారం



సీఏ నాగహారిక, తల్లిదండ్రులను సత్కరిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డు గణపతి కాంప్లెక్స్‌లోని మానవత కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల సీఏ పూర్తి చేసిన అప్పనవీడుకు చెందిన పులపా నాగహారికకు ప్రతిభా పురస్కారాన్ని అందించారు. నాగ హారికకు రూ.25 వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించి ఆమె తల్లిదండ్రులను మానవత సభ్యులు ఘనంగా సత్కరించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, సీనియర్ సభ్యులు గంటా సత్యనారాయణ, నారగాని కొండలరావు, గూడపాటి జయరామచంద్రరావు, పొట్లూరి శేషాచలం, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ భవిష్య విద్యార్థుల ప్రతిభ



పవన్‌రెడ్డి

పెనమలూరు: ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్–2023లో శ్రీ భవిష్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. కళాశాల విద్యార్థి పవన్‌రెడ్డి 99.73 మార్కులు సాధించాడు. ఎస్‌ఎండీ.ఆరీఫ్ 99.60, బి.శ్రీనవ్య 98.94, భరత్‌లింగం 98.33, శ్రీకాంత్‌రెడ్డి 98.26, మనోహర్‌రెడ్డి 98.15 చొప్పున మార్కులు సాధించారు. 95 శాతంకు పైగా మార్కులు సాధించిన వారు 45 మంది, 90 శాతంకు పైగా మార్కులు సాధించిన వారు 123 మంది, ఉండగా, 85 శాతం మంది విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఇంజినీరింగ్ కాలేజీలో సీట్లు పొందారన్నారు. 90 శాతం మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని డైరెక్టర్లు తెలిపారు.

ఈదురుగాలులతో వర్షం



ఈడుపుగల్లు వద్ద జాతీయ రహదారిపై విరిగిపడ్డ తాడిచెట్టు

కంకిపాడు/ఉయ్యూరు: ద్రోణి ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని శనివారం ఆకాశం మేఘావృతమై తీవ్రమైన చలిగాలులు వీచాయి. మబ్బులు కమ్మి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కారణంగా విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ఈడుపుగల్లు వద్ద తాడిచెట్టు విరిగిపడింది. అయితే చెట్టు రోడ్డు అంచున పడటం వల్ల వాహనదారులకు ఎలాంటి అపాయం కలగలేదు. ఉయ్యూరులో విద్యుత్ స్తంభం విరిగింది. ఉరుములు, ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉయ్యూరులో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాన్ని తొలగించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

ఆందోళనలో వరి రైతులు

అకాల వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. ప్రస్తుతం వరి యంత్రాల ద్వారా కోత కోయించి పంటను రోడ్డు మార్జిన్‌లు, కల్లాల్లో నిల్వ చేస్తున్నారు. అకాల వర్షంతో ధాన్యం తడిస్తే నాణ్యత దెబ్బతింటుందని, మార్కెట్‌లో ధర పరిస్థితి ఏమవుతుందోనని రైతులు భయపడుతున్నారు. ధాన్యం రాశులు, కాటా వేసిన ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్‌లు కప్పి పంటను సంరక్షించుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి మృతి

కర్లపాలెం(బాపట్ల): ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు పొన్నూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. మండలంలో చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి సుధాకర్ కుమారుడు వెంకటనారాయణ(19) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్నాడు. వెంకట నారాయణ ఆన్‌లైన్ గేమింగ్‌లో రూ.2లక్షల నగదు పోగొట్టుకుని తల్లిదండ్రులు మందలిస్తారని శుక్రవారం ఎలుకల మందు తిని తన తండ్రికి ఫోన్‌చేసి రైలు ఎక్కి బాపట్ల వచ్చి రైల్వే స్టేషన్‌లో పడిపోయాడు. వెంకటనారాయణను గమనించిన రైల్వే పోలీసులు బాపట్ల ఏరియా వైద్యశాలలో చేర్పించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు పొన్నూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు మృతుడి భౌతికకాయానికి బాపట్ల ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● వెలగా స్మారక స్థూపం ఆవిష్కరణ

కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో వెలగా లక్ష్మణరావు స్మారక స్థూపాన్ని శుక్రవారం రాత్రి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.హరిబాబు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రఘు తదితరులు మాట్లాడారు. సీపీఎం నాయకులు యు.త్రిమూర్తులు, పి.రంగారావు, తాడంకి నరేష్, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.